# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అమరావతిలోని సచివాలయంలో పలు విభాగాలపై సమీక్షలు నిర్వహించారు.
- నర్సింగ్ విద్యారంగాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.
- పట్టణాభివృద్ధి శాఖ సేవల పట్ల ప్రజలు సంతృప్తి చెందేలా పనిచేయాలని మంత్రి పి. నారాయణ అధికారులకు సూచించారు.
- ఒంటిమిట్ట కోదండ రాముని ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ సీతారామ కళ్యాణం రేపు జరగనుంది.

===================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అమరావతిలోని సచివాలయంలో పలు విభాగాలపై సమీక్షలు నిర్వహించారు. అందులో భాగంగా విశాఖ మెట్రో ప్రాజెక్టు, నగరంలోని పైవంతెనల నిర్మాణానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్థిక శాఖ అధికారులతో సమావేశమై ఫైనాన్స్ కమీషన్‌తో చర్చించాల్సిన పలు అంశాలపై సమీక్షించారు. సాయంత్రం ప్రారంభమైన పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశం ఆయన అధ్యక్షతన జరుగుతోంది.

===================

పట్టణాభివృద్ధి శాఖ సేవల పట్ల ప్రజలకు సంతృప్తి పెరిగేలా పనిచేయాలని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పి. నారాయణ కమిషనర్లకు సూచించారు. విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ లో మున్సిపల్ కమిషనర్ల రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ ను ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాలు, రహదారుల నిర్మాణానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అక్టోబర్ రెండో తేదీ నాటికి లెగసీ వేస్ట్ పూర్తిగా తొలగిస్తామని చెప్పారు. గతేడాది కంటే ఈసారి పన్నుల వసూళ్లు 500 కోట్ల రూపాయలు పెంచామని చెప్పారు. పేదలను ఇబ్బంది పెట్టకుండా పన్నుల వసూళ్లు జరుతున్నాయని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ బైట్...34 సెకన్లు)- సెట్

===================

నర్సింగ్ కళాశాలల సంఘం ప్రతినిధులు రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తో ఈరోజు సమావేశమయ్యి, పలు అంశాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యా రంగాన్ని మెరుగుపర్చేందుకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. నర్సింగ్ కాలేజీల ప్రతినిధులు లేవనెత్తిన పలు సమస్యలపై సమావేశంలో చర్చించారు. వివిధ కారణాల వల్ల ప్రతి ఏడాదీ నవంబరులో జరుగుతున్న ప్రవేశాల విధానానికి బదులుగా జులై నాటికి ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. నర్సింగ్ కళాశాలలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న పలు సమస్యల్ని ఈ నిర్ణయం పరిష్కరిస్తుందని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో నర్సింగ్ కామన్ ప్రవేశ పరీక్ష ద్వారా ప్రవేశాలు చేపట్టాలని నిర్ణయించారు.

===================

కడప జిల్లా ఒంటిమిట్ట ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై టిటిడి ఛైర్మన్ బీ ఆర్ నాయుడు ఈరోజు సమీక్ష నిర్వహించారు. రేపు రాత్రి జరగనున్న స్వామి, అమ్మవార్ల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. ఈ ఉత్సవాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీసమేతంగా హాజరయ్యి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్నారని తెలియజేశారు.

===================

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖా మంత్రి జువల్ ఓరం అన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయాన్ని ఈరోజు ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని జగన్నాథ ఆలయానికి వెళ్ళి, దర్శనం చేసుకున్నారు. దేశం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించానని మంత్రి తెలిపారు. అనంతరం విద్యార్థులతో సంభాషించారు. విద్యార్థులకు స్కాలర్ షిప్ లను త్వరగా అందించే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

===================

జాతీయ సర్వే దినోత్సవం సందర్భంగా భూయజమానులకు, సర్వే శాఖ ఉద్యోగులకు రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుతూ రాష్ట్రంలో రీ సర్వే చేపడుతున్నామని చెప్పారు. రీ సర్వే ప్రక్రియ ప్రతిష్టాత్మకంగా సాగుతోందని, సర్వేలో పాల్గొంటున్న అధికారులు... భూ యజమానుల హక్కులను రక్షించే విధంగా పనిచేస్తున్నారని చెప్పారు. రీ సర్వే ప్రక్రియను ఎంతో పకడ్బందీగా చేస్తున్నామని మంత్రి తెలియజేశారు.

===================

రుషికొండ, సాగర్ నగర్ బీచ్ ల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని విశాఖ కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బ్లూఫ్లాగ్ పునరుద్ధరణ నేపథ్యంలో ఈరోజు రుషికొండ బీచ్ ను సందర్శించిన ఆయన... అక్కడ పరిస్థితులను పరిశీలించి భవిష్యత్తు కార్యాచరణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రుషికొండ బీచ్ లో మరిన్ని ఆధునిక వసతులు కల్పించాలని, టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ సెంటర్ నెలకొల్పాలని సూచించారు. సందర్శకుల సౌకర్యాలు, ఇతర సమాచారాన్ని తెలిపే విధంగా ఎక్కడికక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. బ్లూఫ్లాగ్ బీచ్ లో పని చేస్తున్న సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సాగర్‌నగర్ బీచ్ ను కూడా బ్లూఫ్లాగ్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

===================

విరామం

===================

బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి ఈరోజు గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పాలడుగు గ్రామంలో గావ్ ఛలో అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక దేవాలయాన్ని శుభ్రం చేశారు. అనంతరం పురంధరేశ్వరి పాత్రికేయులతో మాట్లాడుతూ .. కేంద్ర ప్రభుత్వ పథకాలను, పార్టీ సిద్ధాంతాలను వివరించడమే గావ్ ఛలో అభియాన్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు.

===================

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని నంద్యాల పోలీస్ సూపరింటెండెంట్ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. నంద్యాల పట్టణంలో ప్రైవేటు ఆసుపత్రుల సౌజన్యంతో వాహన చోదకులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని చెప్పారు. పోలీసు శాఖ చేపట్టిన చర్యలతో రహదారి ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. వాహన చోదకులు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, అలాగే రోడ్డుపై ప్రయాణం చేసే వారిని దృష్టిలో ఉంచుకొని వాహనాలను జాగ్రత్తగా నడపాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

(వాయిస్ బైట్...36 సెకన్లు)-నంద్యాల

===================

ఏజెన్సీలోని వివిధ మండలాల్లో క్వారీలు లీజుకు తీసుకున్నవారు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సూచించారు. ఈరోజు ఆయన సబ్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ తో కలిసి, క్వారీ నిర్వాహకులు, మైనింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంపచోడవరం ఐటిడిఏ పరిధిలోని 11 మండలాలలో మొత్తం 33 క్వారీలు ఉన్నాయని చెప్పారు. వీటిలో 14 క్వారీలు పనిచేస్తున్నాయని, మిగిలిన 19 క్వారీలు ప్రభుత్వం నుండి అనుమతులు లేని కారణంగా నిలిపివేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం పనులు జరుగుతున్న క్వారీలలో ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

===================

దేశంలో రోజురోజుకు హోమియోపతి  వైద్య విధానానికి డిమాండ్ పెరుగుతోందని, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి ఫిజీషియన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ భాస్కర్ రావు తెలిపారు. ఈరోజు ప్రపంచ హోమియోపతి దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... డాక్టర్ హానీమాన్ జీవితం, రచనలు హోమియోపతి జ్ఞానానికి నిధివంటివని అన్నారు. ఎలాంటి చెడు ఫలితాలు లేకుండా, దీర్ఘకాలిక మొండి వ్యాధులను హోమియో వైద్యంతో నయం చేయవచ్చన్నారు. సోరియాసిస్, ఆస్తమా, అలర్జీ, థైరాయిడ్, షుగర్, బీపీ, తదితర వ్యాధులకు హోమియో విధానంలో మెరుగైన చికిత్స అందించవచ్చని డాక్టర్ భాస్కరరావు పేర్కొంటూ..

(వాయిస్ బైట్.. 40 సెకన్లు)- ఎన్టీఆర్ జిల్లా

===================

===================